క్లుప్తంగా...

18న సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: వెనుకబడిన తరగతుల అభివృద్ధి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉదయం 10.30 గంటలకు మేడ్చల్ కలెక్టరేట్ సమావేశం మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి బి.కేశురామ్ తెలిపారు. ఇందులో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, గౌడ కుల సంఘాల నాయకులు, వివిధ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా గురువారం పట్టణంలోని పలు కాలనీల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా ఉండదని ఆయన తెలిపారు. పట్టణంలోని ఎంఆర్ఆర్ కాలనీ, ఉమానగర్, చంద్రనగర్, బాలాజీనగర్, వెంకట్రాంరెడ్డి నగర్, కృపాకాలనీ, ఆర్టీసీ కాలనీ, వినాయక్‌నగర్-2, స్ఫూర్తి కళాశాల పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఏఈ చెప్పారు.

శామీర్‌పేట్‌లో...

శామీర్‌పేట్: శామీర్‌పేట సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని రామాలయం 33/11 కేవీ ఫీడర్ పరిధిలో గురువారం మరమ్మతుల కారణంగా బొమ్మరాశిపేట గ్రామంలోని గోదాములు, వ్యవసాయ పొలాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన వివరించారు.

నేటి నుంచి శ్రావణ మాస పూజలు



కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు శ్రావణ మాస మహోత్సవ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ తటాకం రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు.

రామలింగేశ్వరుడి సేవలో..



రైతు సహకారం సంఘం కార్యాలయంలో మార్క్ ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి

కీసర: తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం కీసర మండల రైతు సహకార సంఘ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డితో రైతు సంక్షేమ పథకాల గురించి చర్చించారు.

కాలనీల మీదుగా ఎస్టీ హాస్టల్ వరకు బస్సు

మేడ్చల్: పట్టణంలోని మూడో వార్డు పరిధిలోని ఎస్టీ హాస్టల్ వరకు కాలనీల మీదుగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడానికి మేడ్చల్ డిపో అధికారులు సమ్మతం చెప్పారని వార్డు కౌన్సిలర్ దేవరాజు తెలిపారు. వార్డు శివార్లలో గిరిజన హాస్టల్ ఉండగా విద్యార్థులు కళాశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని, హాస్టల్ వరకు బాలాజీనగర్, రాఘవేంద్ర నగర్, ఇందిరమ్మ కాలనీ, కేఎల్ఆర్ ఫేజ్-2 కాలనీలు ఉన్నాయని అన్నారు. లంబాడా హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ధన్‌రాజ్‌నాయక్‌తో కలిసి తాను మంత్రి మల్లారెడ్డిని కోరినట్లు చెప్పారు. బస్సు సౌకర్యంతో ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. బస్సును మంత్రి మల్లారెడ్డి ఈ నెల 18న ప్రారంభిస్తారని తెలిపారు.

ఉత్తమ సేవలకు ప్రశంస



జవహర్‌నగర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు గాను జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు తిరుమల్‌రావుకు మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ ప్రశంసా పత్రం అందజేశారు.

చెరువుల పరిరక్షణేదీ..!

- నగర శివారు పురపాలికలు, జీపీల్లో పలుచోట్ల అన్యాక్రాంతం
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
- చిన్న పాటి వర్షాలకే కాలనీలు.. రోడ్లు జలమయం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివార్లలోని చెరువు శిఖాలు, నాలాలు కబ్జా కోరల్లో చిక్కుకోవడంతో చిన్నపాటి వర్షాలకే రోడ్లు, పలు కాలనీలు, స్లమ్ ఏరియాలు జలమయమవుతున్నాయి. వ్యవసాయ భూములన్నీ కూడా వెంచర్లుగా వెలుస్తుండటంతో.. చుట్టూ ప్రహరీలు, కంచెలు వెలుస్తున్నాయి. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితోపాటు అలుగుపడిన చెరువు నీరు నేరుగా సమీపంలోని కాలనీలు, రోడ్లను ముంచెత్తుతుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర శివారు గ్రామాలన్నీ కూడా సెమీ అర్బన్ ప్రాంతాలుగా మారటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లుగా.. ఖాళీ జాగా కనిపిస్తే.. చాలు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. అలాగే చెరువు శిఖాలు, నాలాలు కూడా ఇందుకు మినహాయింపు కాదన్న రీతిలో మింగేస్తున్నారు.

శాటిలైట్ సర్వేతో హద్దుల నిర్ధారణ

శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 22 మున్సిపాలిటీలు, 619 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటి పరిధిలో దాదాపు 552 చెరువులు, కుంటలు ఉన్నట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. వీటి సరిహద్దులను లెక్కించేందుకు ఇప్పటి వరకు 476 చెరువులకు సంబంధించి శాటిలైట్ సర్వే నిర్వహించినప్పటికీ, 270 చెరువులు, కుంటలకు సంబంధించిన హద్దులను మాత్రమే ఖరారు చేసిన అధికార యంత్రాంగం హెచ్ఎండీఏకు నివేదికను సమర్పించింది. ఈ నేపథ్యంలోనే కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న పలు అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, నీటి పారుదల శాఖలు సంయుక్తంగా కూల్చివేశాయి. గుర్తించిన మరి కొన్ని అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు సిద్ధమైనప్పటికీ, కోర్టు వివాదం(స్టే)లో ఉండటం వల్ల వాటి జోలికి వెళ్లలేదు.

కబ్జా కోరల్లో చెరువులు

నగర శివారు పురపాలికలు, గ్రామ పంచాయతీల పరిధిలో 552 చెరువులు, కుంటలు ఉండగా, 352 చెరువులు మినహాయించి, మిగతా చెరువులు, కుంటలన్నీ కాలుష్యం బారిన పడ్డాయి. నీటి పారుదల శాఖ నిర్లక్ష్యం కారణంగా పలుకుబడి కలిగిన వ్యక్తులు దర్జాగా చెరువుల ఎఫ్‌టీఎల్.నాలాల స్థలాలు కబ్జా చేశారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖల మధ్య సమన్వయం లేకపోవటం వల్ల ఈ కబ్జాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇదే అదనుగా భావించిన రియల్ ఏస్టేట్ వ్యాపారులు కూడా చెరువులు, నాలా స్థలాలు అక్రమించి వెంచర్లు వేసి నిర్మాణాలు చేపట్టడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షం నీటితో పాటు, వరద నీరు సమీప కాలనీలు, లోతట్టు ప్రాంతల్లోని ఇళ్లలోకి చేరుతుండటం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

వాజ్‌పేయికి ఘన నివాళి



ఘట్‌కేసర్‌లో నివాళులర్పిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు

మేడ్చల్: భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ నాయకులు నివాళులర్పించారు. పట్టణంలోని ఆయన విగ్రహం వద్ద నేతలు నివాళులర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. బీజేపీ నాయకులు ఆంజనేయులు, ప్రేందాస్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్, సర్వేశ్వర్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

ఘట్‌కేసర్: భారతదేశ పవర్‌ను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత భారత ప్రధాని దివంగత అటల్ బిహారి వాజ్‌పేయికే దక్కిందని ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ కన్వీనర్ శ్రీనివాస్, మండల కార్యదర్శి ప్రభంజన్, మహిపాల్‌రెడ్డి, బస్వరాజ్, రామోజీ, శ్రీరాములు, మశ్చేందర్‌రెడ్డి, వీరారెడ్డి, శివనాయక్, నరేశ్, శ్రీకాంత్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అంబేడ్కర్ యూత్ భవనానికి స్థలం కేటాయించాలి



అవుషాపూర్ సర్పంచ్‌కు వినతి అందజేస్తున్న అంబేడ్కర్ యూత్ సభ్యులు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో బీఆర్ అంబేడ్కర్ యూత్ భవనానికి స్థలం కేటాయించాలని ఆ యూత్ సభ్యులు సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి, కార్యదర్శి సునీతకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో అంబేడ్కర్ యూత్ భవనం కోసం స్థలం కేటాయించాలని లేఖలో కోరారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు మహేశ్, జీవన్, చంద్రయ్య, సాయిలు, ముత్యాలు, వెంకటేశ్, దశరథ, ఉపేందర్, మధు, ప్రశాంత్, భాను, మధుసూదన్, పవన్, శ్యాంరావు, బాలరాజ్, శ్యామ్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థిక సాయం



కీసర: రాంపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1999-2000 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థి గూడెం మహేష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న స్నేహితులు బుధవారం అతడికి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కొండేటి రాంరెడ్డి, పరమేష్, నాగరాజ్, సురేష్, కొండేటి లక్ష్మారెడ్డి, అంజలి, కందాడి శ్రీకాంత్‌రెడ్డి, సాయికుమార్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోవింద్‌కు కరాటేలో బ్రౌంజ్ మెడల్



బ్రౌంజ్ మెడల్ అందుకుంటున్న గుగులోత్ గోవింద్ నాయక్

పోచారం: ససాకి షోదిన్ మెమోరియల్ వెటరన్స్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో అన్నోజిగూడకు చెందిన గుగులోత్ గోవింద్ నాయక్‌కు బ్రౌంజ్ మెడల్ దక్కింది. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన టోర్నమెంట్స్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల నుంచి గోవింద్ నాయక్ పోటీపడి బ్రౌంజ్ మెడల్ సాధించారు. జపాన్ మాస్టర్ తకుయ తనియమ చేతులమీదుగా మెడల్‌తో పాటు సర్టిఫికెట్ అందుకున్నారు. అలాగే అంతర్జాతీయ జపాన్ బ్లాక్ బెల్ట్ యోన్‌దన్ 4వ డాన్, ఇన్‌స్ట్రక్టర్ ఎగ్జామ్, జడ్జ్ పరీక్షల్లోనూ పాల్గొన్నారు.

‘అనురాగ్’లో ఉత్తమ బోధన పద్ధతులపై శిక్షణ



ఏయూలో శిక్షణ సదస్సులో అధ్యాపకులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ) అధ్యాపకులకు ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ ప్రాక్టీస్ అండ్ రీసెర్చ్(సీఈఈపీఆర్) ఆధ్వర్యంలో బుధవారం ఎవిడెన్స్-బెస్ట్ టీచింగ్ ప్రాక్టీస్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు 24 బోధన పద్ధతులు ప్రెజెంట్ చేయగా 18 ఉత్తమ పేపర్లు ప్రదర్శనకు ఎంపికయ్యాయి. స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డాక్టర్ మన్సూర్‌కు మొదటి బహుమతి, ఇంజినీరింగ్ విభాగంలో నీరజ, అపర్ణప్రియ కన్సోలేషన్ బహుమతులు గెలుపొందారు. ఇంజినీరింగ్ విద్యాభివృద్ధికి కేజీఆర్‌సీఈటీ కాన్‌క్లేవ్‌లో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, డీన్లు, డైరెక్టర్లు, పీఈపీఆర్ డైరెక్టర్ మధు, సమన్వయకర్తలు రఘు, ఇంద్రకాంతి, సరిత, అజిత పాల్గొన్నారు.

మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని గురుకుల మహిళా డిగ్రీ మహేంద్రహిల్స్, బుద్వేల్, ఇబ్రహీంపట్నం కళాశాలలో సీసీఎంబీ, వీఐటీఎం సంయుక్తంగా బుధవారం మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో జన్యుపరమైన వ్యాధులు, మేనరికాల వివాహాల కారణంగా సక్రమించే జన్యు సంబంధ సమస్యలను అరికట్టడంపై 20 అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్సీఓ నాగకళ్యాణి, ప్రిన్స్‌పల్స్ హేమామాలిని, వెంకటేశ్వర్, విజయలక్ష్మి, మాజీ వార్డు సభ్యురాలు విమల, శశికళ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘అన్ సంగ్ హీరోస్’

సాక్షి, సిటీబ్యూరో: 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్ పట్టణంలోని ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో నాలుగు రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం కార్యక్రమాల ముగింపు సందర్భంగా ‘అన్ సంగ్ హీరోస్’ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన ఎందరో మహనీయులకు సరైన గుర్తింపు లభించని వారిని ఈ తరానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల పరేడ్ ఆకట్టుకుంది.



ఓటు వినియోగించుకునేలా విస్తృత ప్రచారం

జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రిటర్నింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా జనాభా ఓటర్ల నిష్పత్తి, లింగ నిష్పత్తి, ఓటర్లలో యువ ఓటర్ల నిష్పత్తిపై సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అమయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో శాసనసభ ఎన్నికలపై రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్‌తో ఆయన మాట్లాడారు. ఇందులో హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొనగా కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ పాల్గొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, నియోజకవర్గంలో ఓటింగ్ టర్న్ అవుట్ పెంపునకు తీసుకోవాల్సిన చర్యలు, నూతన ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో లింగ నిష్పత్తి, జనాభా ఓటర్ల నిష్పత్తి తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ అమయ్ కుమార్ సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా మంజూరు చేసిన ఓటర్లకు ఓటర్ గుర్తింపు కార్డులు ముద్రించి అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో వినూత్న ఆలోచనతో ఓటరు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ఈ నెల 19న జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఓటర్ ప్రాముఖ్యతను వివరిస్తూ ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదానికి ప్రచారం కల్పిస్తూ 5కే రన్ నిర్వహించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్యం, పరీక్షలు



సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

సాక్షి, మేడ్చల్‌జిల్లా: ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్యం, ఉచిత పరీక్షలు చేయడమే బస్తీ దవాఖానాల ప్రధాన లక్ష్యమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. బస్తీ దవాఖానాలు దేశానికే రోల్ మోడల్ అయ్యాయని ఆయన పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డివిజన్ల జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు, ప్రైమరీ, అర్బన్, హెల్త్ సెంటర్స్, బస్తీ, పల్లె దవాఖానా మెడికల్ ఆఫీసర్స్‌తో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతిబస్తీ, పల్లె దవాఖానాల్లో సగటు ఓపీ 80-100 నమోదు కావాలన్నారు. క్లినిక్స్‌కు వచ్చిన 25 శాతం మంది మహిళలకు అవసరమైన రోగనిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు. రోగ నిర్ధారణ పరీక్షలు టీ-డయాగ్నొస్టిక్ కేంద్రాల ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్న సమాచారాన్ని ప్రజలకు తెలపాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారులను డీఎంహెచ్ఓ ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్, మందులు, ఫ్లూయిడ్స్, యాంటీ స్నేక్, యాంటీ రేబీస్ ఇంజక్షన్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

విద్యార్థులకు బస్‌పాస్ సౌకర్యం



విద్యార్థులకు బస్‌పాస్‌లకు అందజేస్తున్న కౌన్సిలర్ సరితారమేష్ తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి ప్రభుత్వ పాఠశాలకు వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు మున్సిపల్‌కు చెందిన 1వ వార్డు సభ్యురాలు సరితారమేష్ ఉచితంగా బస్ పాస్ సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా బుధవారం రాంపల్లిలో సుమారు 500 మందికి ఆర్టీసీ మంజూరు చేసిన బస్‌పాస్‌లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో చెంగిచెర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్ ఆనందర్‌రావు, రాంపల్లి ప్రభుత్వ పాఠశాల హెడ్‌మాస్టర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

150 మంది విద్యార్థులకు..



ఘట్‌కేసర్‌లో ఆర్టీసీ బస్ పాసులు అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న 150 మంది విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఆర్టీసీ బస్‌పాస్‌లను మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. జంగయ్యాయాదవ్, విజయ్‌ముదిరాజ్, ఫయామ్, సాయికిరణ్, నిఖిల్, సందీప్‌చారి, హెచ్ఎం ఉమ్లా నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



సుమార్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుమార్ చెరువు ఎఫ్‌టీఎల్‌లోని అక్రమ నిర్మాణాలను బుధవారం అధికారులు కూల్చివేశారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు పోలీసుల సహకారంతో గ్రామంలోని సర్వే నంబర్-537లోని సుమార్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నెలకొల్పిన షెడ్లు, నిర్మాణాలను జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కూల్చివేతల్లో ఇరిగేషన్ డీఈ సురేశ్, ఏఈ నికేశ్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



జవహర్‌నగర్‌లో అక్రమ కట్టడాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్

జవహర్‌నగర్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్- 370, 371, 380, 815లలో ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ అమాయక ప్రజలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



శ్రీసాయినగర్ ఈస్ట్ కాలనీలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ శ్రీసాయినగర్ ఈస్ట్ కాలనీలో సుమారు రూ.8 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ సుభాష్ నాయక్, కమిషనర్ ఇస్లావత్ నమ్మతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏఈ భిక్షపతి, వర్క్ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, అధ్యక్షుడు పగడాల బాల్‌రాజ్, సురేందర్‌రెడ్డి, రామోజీశంకరాచారి, ఉపేందర్, కిరణ్ నాయక్, ప్రకాష్‌గుప్తా, శ్రీసాయినగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.